www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 21 డిసెంబర్ 2024

5

చిత్తూరు





ఆరోగ్యంతో చెలగాటం

నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లు

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్: చిత్తూరు నగరం మురకంబట్టిలో పుట్టగొడుగుల్లా హోటల్లు పుట్టుకొస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం అపోలో యూనివర్సిటీ, ఆర్‌విఎస్ ఇంజనీరింగ్ కళాశాల, సీటమ్స్ ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్, లా కాలేజ్ వంటి విద్యాసంస్థలు. విద్యార్థులను ఆధారం చేసుకుని ఈ హోటల్ వ్యాపారం ప్రధానంగా సాగుతోంది. ఫుట్‌పాత్ హోటల్స్ నుంచి రెస్టారెంట్లు, దాబాల వరకూ అన్ని వెలిశాయి. ఎక్కువగా విద్యార్థులు, ప్రజల వస్తూపోతూ ఉండటంతో హోటల్ యజమానుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కళకళలాడుతోంది. అయితే ఈ హోటళ్లలో పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా.. ఆహార పదార్థాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారా లేదా అన్న అనుమానాలు వినిపిస్తున్నాయి.

ప్రధాన నగరాల్లోని పలు హోటళ్లపై అధికారులు దాడుచేసిన సందర్భాల్లో పాడైన కూరగాయలు, కల్తీ నూనెలు, కాలం చెల్లిన మసాలాలు, నాణ్యత, సురక్షిత నీరు గాలి వంటివి లేకుండా లాభాపేక్షతో వ్యాపారం చేస్తున్న సంఘటనలు మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. చాలా చోట్ల వాడిన నూనెను మళ్లీమళ్లీ వాడి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న సంఘటనలు నిత్యం వెలుగుచూస్తూనే ఉన్నాయి. మహా నగరాల్లోనే ఇలాంటి పరిస్థితి ఉంటే.. మరి ఇక్కడ పరిస్థితి ఎలా ఉంటుందో అని అనుమానం వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉండగా ఇక్కడి హోటళ్లలో ఒకరోజు ఉన్న రుచి మరో రోజు ఉండటం లేదని, రోజుకో రంగు మారుతోందని, తినే ప్లేట్లు సైతం శుభ్రంగా ఉండటం లేదని, వాటర్ బాటిల్స్ వాడిన వాటినే మళ్లీ నీరు నింపి పెడుతున్నారని విద్యార్థులు, స్థానికులు వాపోతున్నారు. విద్యార్థులు ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని ఫుడ్‌సేఫ్టీ అధికారులు, సంబంధిత ఇతర అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించిన హోటళ్లపై తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.





అమిత్ షా క్షమాపణ చెప్పాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి- పలమనేరు: హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, వెంటనే పదవికి రాజీనామా చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అన్నూరు ఈశ్వర్, జనవిజ్ఞాన వేదిక నాయకులు కుమారస్వామి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఆయలోని మనువాద దృక్పథాన్ని బయటపెట్టాయని అన్నారు. సామాజిక విప్లవ యోధుడు, మహనీయుడు డాక్టర్ అంబేద్కర్ అని, దేశంలో అట్టడగు వర్గాలకు కోట్లాది దళితుల ఆత్మాభిమానం ఆత్మ గౌరవానికి అంబేద్కర్ ప్రతిబింబించినవారని కొనియాడారు. అటువంటి అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడిని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పడంతోపాటు పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పాకాల సుబ్రహ్మణ్యం, పురుషోత్తం, రామ్ ప్రసాద్, కవిత పాల్గొన్నారు.



పలమనేరులో రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత అమిత్‌షాకు లేదు

పెద్దపంజాణి: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు లేదని మండల మాలమహానాడు అధ్యక్షులు టియం.మంజునాథ్ అన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలకు నిరసన తెలియజేసి శుక్రవారం మండలం కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ అమిత్ షాకు నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే అంబేద్కర్ వాదులు, వారసులు ఊరుకోరనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారమే అమిషా పార్లమెంటుకు ఎన్నికైన విషయం మర్చిపోవద్దని, రాజ్యాంగం అనుసరించే దేశ పరిపాలన జరుగుతుందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోని మాట్లాడాలని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర అమిత్ షా అంబేద్కర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నైతిక బాధ్యత వహించి తన హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాసంఘాలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అమర నారాయణ, తిప్పన్న, యూత్ నాయకులు వెంకటేష్, నాగరాజు, రెడ్డప్ప, శివన్న, వెంకట రమణ పాల్గొన్నారు.

విజయపురం (నగరి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బస్టాండు ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జైభీమ్ సేన, కాంగ్రెస్ పార్టీ, బీఎస్పీ, సీపీఐ, ఏపీఎల్ఎఫ్, బహుజన ఆటో యూనియన్ వర్కర్స్ ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.బాబు, జైభీమ్ సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పవర్ రామచంద్రన్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్ షా వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష నాయకులు వేలన్, సబీర్ బాష, చంద్రయ్య, రాజేష్, శ్రీనివాసులు, విజయ్, శేఖర్, బాబు, జేమ్స్, ఉమాపతి పాల్గొన్నారు.

కుప్పం టౌన్: కేంద్ర మంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కుప్పం పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేంద్ర మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. రాజ్యాంగ నిర్మాతను అవమానించడం భారత రాజ్యాంగాన్ని ధిక్కరించడమేనన్నారు. వెంటనే ఆయన మాట్లాడిన మాటలను ఉపసంహరించుకుని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పిజి సెల్వం, కృష్ణప్ప, గాలి సురేష్, జిసి వెంకటేష్, నాగార్జున, తులసీదాస్, వెంకటేష్, మురుగేష్, సురేంద్ర బాబు పాల్గొన్నారు.


పెద్దపంజాణిలో..



విజయపురంలో..


కుప్పంలో..

కుప్పం అభివృద్ధికి రూ.456 కోట్లు విడుదల

అన్ని నియోజకవర్గాలకు నిధులు ఇవ్వాలి : సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి 11 రకాల పనులు కోసం రూ.456 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం అభినందనీయమని, అలాగే అన్ని నియోజకవర్గాలకు అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కుప్పం నియోజకవర్గానికి నాలుగు మండలాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.456 కోట్లు కేటాయించి 11 రకాల పనులను గుర్తించిందని, వాటన్నిటిని శర వేగంగా ప్రారంభించే పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చార అన్నారు. అలాగే జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లోనూ గ్రామీణ ప్రజలు మౌలిక వసతులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వీధిలైట్లు కూడా వెలగక గ్రామాలు చీకటమయమయ్యాయని, రోడ్లు సరిగాలేవని, తాగునీరు లేక కొన్ని గ్రామాలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇలాంటి మౌలిక వసతులు కోసం అన్ని నియోజకవర్గాలకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు. ఎయిర్‌పోర్టు, కృషి విజ్ఞాన కేంద్రం కుప్పం ప్రాంతానికి కేటాయించడం జరిగిందని, జిల్లా కేంద్రానికి కూడా నిధులు వెంటనే కేటాయించి అభివృద్ధికి వేగవంతం చేయాలని, కేటాయించిన నిధులను దారు మళ్లించకుండా ప్రజా ప్రయోజనాలకు సద్వినియోగం చేయాలని కోరారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- యథావిధిగా కోళ్లఫారాలు
- ప్రజలకు తప్పని కష్టాలు
- అవస్థలు పడుతున్న స్థానికులు

ప్రజాశక్తి- గంగవరం: కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతర్ చేస్తూ మండలంలో కోళ్లఫారాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. మండలంలోని పసుపత్తూరు పంచాయతీ మార్జేపల్లి దాదాపు 500 మంది ప్రజలు జీవిస్తున్నారు. గ్రామం సమీపంలోనే కోళ్లఫారాలు పెట్టడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని గతంలో ప్రజాశక్తిలో వార్తలు ప్రచురించడంతోపాటు, గ్రీవెన్స్ డేలో గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ స్పందించి వెంటనే విచారణ జరపాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. దీంతో గతనెల స్థానిక వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి గ్రామంలో విచారణ చేపట్టి గ్రామంలో అనుమతి లేకుండా దాదాపు 30 కోళ్లఫారాలు ఉన్నాయని, వీటి వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నివేదికలను డిఎం అండ్‌హెచ్‌ఓకు అందజేశారు. అయితే గ్రామంలోని సర్పంచ్ అండతో కోళ్లఫారాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఈ విషయమై గంగవరం ఎంపిడిఓకు ఫిర్యాదు చేయగా 15 రోజులకు నామమాత్రంగా తనిఖీలు చేపట్టారు.

గ్రామాలకు సమీపంలో కోళ్లఫారాలు ఉండటం వలన చాలా ఇబ్బంది పడుతున్నామని, కోళ్లఫారాల నుంచి వచ్చే దుర్వాసన, వ్యర్థాల కారణంగా కనీసం తిండి తినలేకపోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. రోగాల భారిన పడి చనిపోయిన కోళ్లను కాల్చివేయాల్సి ఉండగా వాటిని గ్రామశివారుల్లో పడవేస్తున్నారని కుక్కలు వాటిని తిని గ్రామాల్లోకి తెచ్చివేస్తున్నాయి వీటి వలన వచ్చే వాసన భరించలేకపోతున్నామని చెబుతున్నారు. అంతేకాకుండా కోళ్లఫారాల నుంచి వచ్చే వ్యర్థాలు మురుగునీటి కాలువల్లో, రోడ్లపై ప్రవహిస్తూ అపరిశుభ్రంగా తయారవుతోందని, వీటివలన దోమలు, ఈగలు, పురుగులు అధికమై గ్రామంలోని ప్రజలు నిత్యం రోగాలభారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులు ఫిర్యాదు చేసినా, అధికారులు పరిశీలించి నివేదికలు ఇచ్చినా ఫలితం లేకుండాపోతోందని తమ గోడు పట్టించుకునే నాథుడే లేరని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అనుమతి లేని కోళ్లఫారాలు తొలగించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరుతున్నారు.


ఇళ్ల మధ్యలోనే ఉన్న కోళ్ల ఫారాలు

సమసమాజ స్థాపనకు కృషి : నారా భువనేశ్వరి

- రెండవ రోజూ కొనసాగిన నారా భువనేశ్వరి పర్యటన
- వైసిపి కుప్పంలో అభివృద్ధి లేకుండా చేసింది
- నేటి బాలలు రేపటి ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరి కుప్పం పర్యటన శుక్రవారం రెండవ రోజు కొనసాగింది. ముందుగా పీఈఎస్ వైద్య కళాశాల ఆవరణలో ప్రజల నుండి వినతులు స్వీకరించిన అనంతరం మండల పరిధిలోని వానగుట్టపల్లి, పొన్నాంగూరు, మల్లానూరు, అడవిబూదుగూరు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రజలు నారా భువనేశ్వరికి మంగళ హారతులు పట్టి, డప్పు వాయిద్యాల మధ్య, పూల వర్షాన్ని కురిపించి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో వైసిపి ప్రభుత్వం కుప్పం నియోజకవర్గంపై సీత కన్ను వేసిందని, నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి జాడ లేకుండా చేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో సైతం వైసీపీ చేసిన అభివృద్ధి జాడ లేదని, ఇది గమనించిన ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా వైసిపిపై యుద్ధం ప్రకటించి, కూటమి ప్రభుత్వానికి చరిత్ర ఎరగని గెలుపును ఇవ్వడంతో రాష్ట్రానికి తిరిగి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఎన్నిక కావడం జరిగిందని తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో సైతం అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యిందని, రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా కుప్పంను అభివృద్ధి చేయడానికి బాబు కృషి చేస్తున్నారని తెలిపారు. సమసమాజ స్థాపన చేసి, పేదరికం లేని సమాజాన్ని భవిష్యత్తులో తీసుకురావడానికి బాబు ప్రణాళిక రూపొందించి, పనిచేస్తున్నారని తెలిపారు. మహిళా సాధికారతే లక్ష్యంగా గతంలో ఆయన డ్వాక్రా గ్రూపులను పరిచయం చేస్తే, అప్పటి ప్రతిపక్షాలు అనేక రకాలుగా విమర్శిస్తూ ఎద్దేవా చేశాయని, అప్పుడు విమర్శించిన వారే తరువాత వారు అధికారం చేపట్టిన సమయంలో మహిళా సాధికారత సాధించడానికి డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేయడమే మార్గమని గుర్తించి పని చేసినట్టు తెలిపారు. అంతటి విజన్ కలిగిన బాబు ప్రస్తుతం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చగలరని భరోసా కల్పించారు. గత 35 సంవత్సరాలుగా బాబును నమ్మి గెలిపిస్తున్న కుప్పం ప్రజల రుణాన్ని ఎన్నటికీ తమ కుటుంబ సభ్యులు తీర్చుకోలేరని, ఈ ఐదు సంవత్సరాలలో కుప్పంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి పనిచేస్తామన్నారు. ఈ పర్యటనలో భాగంగా పన్నాంగూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వారికి మంచి విద్యను అందించడానికి అవసరమైన వాటిని సమకూర్చడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని, అవసరమైతే ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున పేద విద్యార్థుల అవసరాలను తీర్చడానికి చర్యలు చేపడతామన్నారు. నేటి బాలలు రేపటి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఉత్తమ విద్యను అభ్యసించినప్పుడే అది సాధ్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నూతన పద్ధతులను ప్రవేశపెట్టి, ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈఅవకాశాలను విద్యార్థులు ఉపయోగించుకొని, ఉత్తమ విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పట్టణం మోడ్రన్ కాలనీలో వెలసిన శ్రీ ప్రత్యంగిరా దేవి ఆలయాన్ని నారా భువనేశ్వరి సందర్శించి అమ్మవారికి వెండి కిరీటాన్ని అందించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.




ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్న నారా భువనేశ్వరి, విద్యార్థులతో ముచ్చటిస్తూ..

పాడి రైతులకు ఉపయోగం గోకులం షెడ్లు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: పాడి రైతులకు గోకులం షెడ్లు ఎంతో ఉపయోగకరమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ కుప్పం, గోపనపల్లి, దాసేగౌనూరు గ్రామాలలోని గోకులం షెడ్ల నిర్మాణ పురోగతి, డ్రిప్ పరికరాల ద్వారా సాగు పద్ధతులను కడా పీడీ వికాస్ మర్మత్‌తో కలసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు గోకులం షెడ్ల నిర్మాణం కొరకు రాయితీతో నిధులు మంజూరు చేయడం జరుగుతున్నదని తెలిపారు. ప్రతి రైతు వ్యవసాయంతో పాటు పశువుల పోషణతో జీవనం సాగిస్తారని, వ్యవసాయంలో లోటుపాట్లు ఉన్నప్పటికీ పాడి పశువుల పెంపకం ద్వారా రైతులకు ఎంత మేలు జరుగుతోందని తెలిపారు. అలాంటి పశువులకు షెడ్ల నిర్మాణం చేపట్టి వాటి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టడంలో భాగంగా షెడ్లు మంజూరైన రైతులు గోకులం షెడ్లను త్వరితగతిన నిర్మించి పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన నమూనా మేరకు షెడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. బిందు తుంపర్ల సేద్య పరికరాలను వినియోగించి తక్కువ నీటితో సాగు చేసేందుకు ఉపయుక్తమయ్యే పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా దాసేగౌనూరు డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో పంట సాగు చేస్తున్న వెంకటాచలం పొలంను పరిశీలించి, అతని పొలంలోనే రూఫ్ లెవెల్ వరకు ఉన్న షెడ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. మంకలదొడ్డిలో పూర్తయిన గోకులం షెడ్డును పరిశీలించగా తనకు ఆరు ఆవులు ఉన్నాయని ఈ షెడ్డు నిర్మాణం ద్వారా తమకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నదని రైతు కలెక్టర్‌కు వివరించారు.


గోకులం షెడ్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్

రోగులకు సకాలంలో

వైద్యసేవలు అందించండి:కలెక్టర్

కుప్పం టౌన్: ప్రాంతీయ ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు సకాలంలో వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కుప్పం పర్యటనలో భాగంగా కలెక్టర్ ప్రాంతీయ ఆసుపత్రిని కడ పీడీ వికాస్ మర్మత్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం ఏరియా ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు వైద్యులు అందుబాటులో ఉండి సకాలంలో వైద్యసేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో పేషెంట్లకు అందజేసే మందులు అందుబాటులో లేని సమయంలో వెంటనే కొనుగోలు చేసి పేషెంట్లకు అందజేయాలన్నారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి ఫార్మసీని, అందులోని మందులను తనిఖీ చేశారు. ఫార్మసీ అధికారులు పేషెంట్లకు మందులు ఇవ్వకమునుపే గడువు తీరిన మందులను తొలగించాలని, విధుల పట్ల బాధ్యతతో పనిచేయాలని తెలిపారు. ప్రాంతీయ ఆసుపత్రిలో అత్యవసరమైన మందులు, పరికరాలను ఆస్పత్రి అభివృద్ధి నిధి నుంచి కొనుగోలు చేయాలని రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. కలెక్టర్ పర్యటనలో ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయ కుమారి సంబంధిత డాక్టర్లు, అధికారులు హాజరయ్యారు.


ఫార్మసీని తనిఖీ చేస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

ఆగని జంట ఏనుగుల దాడులు

- మామిడి, అరటి, వరి, టమోటా, కొబ్బరి పంటలపై దాడి
- ఆందోళనలో రైతులు
- నష్టపరిహారానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్న అటవీశాఖ

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పరిధిలో గత నాలుగు రోజులుగా జంట ఏనుగులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తూ పంట పొలాలపై దాడులు చేస్తూ తీవ్ర-నష్టాన్ని కలిగిస్తున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో బంగ్లా గ్రామసమీపంలోని సుబ్రహ్మణ్యం అనే రైతుకు చెందిన 10 మామిడి చెట్లను, రెండు కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. బుధ, గురువారం తెల్లవారుజామున ఒంటి గంట నుండి నాలుగు గంటల మధ్య ప్రాంతంలో ఈ నడింపల్లి, దాదెం గొల్లపల్లి గ్రామాల పరిధిలోని పంట పొలాలలో యథేచ్ఛగా జంట ఏనుగులు తిరుగాడి కృష్ణప్ప అనే రైతుకు చెందిన అరటి చెట్లు పూర్తిగా తినేశాయి. అదే గ్రామానికి చెందిన మోహన అనే రైతు తన వ్యవసాయ పొలం వద్ద బండపై వరి ధాన్యాన్ని ఆరబోసి పట్టలు కప్పి ఉంచగా జంట ఏనుగులు వచ్చి దాదాపు 23 మూటలు తిని మిగిలిన ధాన్యాన్ని చెల్లాచెదురు చేశాయి. అలాగే దాదెం గొల్లపల్లికి చెందిన శివశంకర్ మామిడి టమోటా పంటలపై దాడి చేసి నష్టం కలిగించాయి, అదే గ్రామానికి చెందిన గంగాధర, జయశంకర్ పంట పొలాలపై దాడి చేశాయి.

జంట ఏనుగుల విధ్వంసం పై అటవీ అధికారులకు రైతులు సమాచారం ఇవ్వగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఇంద్రాణి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రభాకర్ రైతుల పొలాల వద్దకు చేరుకొని జరిగిన నష్టాన్ని అంచనా వేసి పై అధికారులకు సమాచారం అందిస్తామని జరిగిన నష్టాన్ని రైతులకు పూర్తిగా తీర్చలేకపోయినా కొంతమేర ప్రభుత్వం నుండి నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని జంట ఏనుగులు ప్రస్తుతం పెద్ద అడివిలోకి వెళ్లిపోయాయని వాటి కదలికలను గమనిస్తూ రైతులను హెచ్చరిస్తూనే ఉన్నామని తెలిపారు. కృష్ణప్ప అనే రైతు పదివేలు మోహన అనే రైతు రూ.50వేలు, శివశంకర్ రూ.20వేలు, గంగాధర్‌కు రూ.10వేలు, జయశంకర్ రూ.30 వేల పంట నష్టం జరిగినట్టుగా అటవీ అధికారులకు అర్జీలను సమర్పించినట్టు రైతులు తెలిపారు.

ఏనుగుల సంచారం, ఒంటరి ఏనుగు, జంట ఏనుగులు, ఏనుగుల మంద ఇలా మండలంలో పలు ప్రాంతాలలో పలు పంచాయతీల పరిధిలోని అటవీ సమీప పంట పొలాలపై ఏనుగులు దాడులు చేయడం రైతులకు తీవ్రనష్టాన్ని కలిగించడం అప్పోసోప్పో చేసి పంటలు పండించి తీరా ధాన్యాన్ని ఇంటికి చేర్చుకునే సమయానికి ఏనుగులు ధ్వంసం చేయడం తినివేయడం లాంటి సంఘటనలు నిత్యం పరిపాటి అయిపోతున్నాయి. అటవీ శాఖ అధికారులు రైతులకు ఏనుగులు రాకను ఎలా పసిగట్టాలి? అవి వస్తే వాటిని ఏ విధంగా దూరంగా తరిమివేయాలి అన్న అవగాహన కార్యక్రమాలను ఏనుగులు సంచార పంచాయతీలలో నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తే కొంతమేర రైతులు కూడా రాత్రివేళలో పొలాల వద్ద కాపలాగా ఉండి ఏనుగుల కదలికలను పసిగట్టి వారు పంట నష్టం కాకుండా ఏనుగులను తరిమి వేసేందుకు చర్యలు తీసుకుంటారు. అదేవిధంగా రైతులకు ఎక్కువ కాంతిగల టార్చిలైట్లను ప్రభుత్వం అందజేసి తద్వారా ఏనుగుల కదలికలను దూరం నుంచి గమనించే విధంగా రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని జరిగిన పంట నష్టానికి పూర్తిస్థాయిలో పరిహారం ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


టమోటా పంటను పరిశీలిస్తున్న అటవీ అధికారి


ఏనుగుల పాద ముద్ర


మామిడి మొక్కలను విలిచివేసిన దృశ్యం

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

చిత్తూరు అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వస్తే చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్ ఇంజనీర్లను చిత్తూరు అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర హెచ్చరించారు. శుక్రవారం చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. నగరంలో అక్రమ కట్టడాలు, రోడ్డు ఆక్రమణలు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో టిపిఓ శుభప్రద సర్వేయర్ పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని చిన్నమనాయునిపల్లి గ్రామానికి పలమనేరు - పుంగనూరు జాతీయ రహదారి నుంచి తారు రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతు గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక గతం నానా ఇబ్బందులు పడ్డామని ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి చొరవతో రోడ్డుపనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వెంకట రమణారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీనివాసులు, యూనిట్ ఇంచార్జ్ శీనప్ప పాల్గొన్నారు.

అడుసుపల్లెలో 104 వైద్యసేవలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ అడుసుపల్లి గ్రామంలో సోమల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, 104 సిబ్బంది కలసి గ్రామంలో ప్రజలకు వైద్యసేవలను అందజేశారు. వైద్యాధికారి జయసింహ మాట్లాడుతూ 104, 108 వాహన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రతి మూడవ శుక్రవారం అడుసుపల్లి గ్రామంలో 104 ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. సిహెచ్ఓ అమర్నాథ్, సబ్ యూనిట్ ఆఫీసర్ గంగయ్య, ఏఎన్ఎం గీత, డీఈవో జగదీశ్వర, ఆశా కార్యకర్తలు అన్నపూర్ణ, శోభారాణి, పైలెట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

హైవే నిర్మాణంలో పాత కొలతలనే పాటించండి

ఆర్‌డిఓకి వినతి

ప్రజాశక్తి- విజయపురం (నగరి): హైవే నిర్మాణంలో పాత కొలతలనే పాటించాలని మండలంలోని తడుకుపేట, వీకేఆర్ పురం గ్రామాలకు చెందిన బాధిత రైతులు శుక్రవారం ఆర్డీవో భవానీశంకరికి వినతిపత్రం అందజేశారు. 2008-09 సంవత్సరంలోనే జాతీయ రహదారి 205 రోడ్డు 60 మీటర్ల వెడల్పుతో నిర్మాణానికి కొలతలు తీసారని ఆ మేరకు మా భూములు వదులుకొని మిగిలిన భూములు సాగుబడి చేసుకుంటూ బతుకుతున్నామని, ఆ భూములే మా జీవనాధారమని తెలిపారు. నాడు తీసిన కొలతల ప్రకారం రోడ్డు వేయని అధికారులు నేడు రోడ్డు నిర్మాణంలో భాగంగా ఆ కొలతలు వదలి కొత్త కొలతలు తీస్తున్నారని, ఆ కొలతల ప్రకారం రోడ్డువేస్తే చిన్న, సన్నకారు రైతుల జీవనాధారాన్ని కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టా భూముల్లో టోల్ ప్లాజాను ఏర్పాటు చేయకుండా తడుకుపేట వద్ద ఉన్న ప్రభుత్వ భూముల్లోనే టోల్‌ప్లాజాను ఏర్పాటు చేయాలని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్‌హెచ్ 205 బాధిత రైతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి

హౌసింగ్ ఈఈ స్వామి దాస్

ప్రజాశక్తి- చౌడేపల్లి: హౌసింగ్ లబ్ధిదారులు తమకు మంజూరైన గృహనిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఆ శాఖ ఈఈ స్వామిదాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈఈ మాట్లాడుతూ మండలానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా 2272 గృహాలు మంజూరు అయ్యాయని. వాటిలో 634 గృహాలు వివిధ నిర్మాణాలలో ఉన్నాయన్నారు. మిగిలిన వారందరూ పూర్తిచేస్తే బిల్లులు వెంటనే మంజూరు చేస్తారన్నారు. అనంతరం కార్యాలయంలోని బిల్లుల పంపిణీ, వివిధ రికార్డులను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. హౌసింగ్ అధికారి భూపతి సిబ్బంది పాల్గొన్నారు

గృహ నిర్మాణాలను పర్యవేక్షించిన ఎంపీడీవో

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలో జరుగుతున్న గృహ నిర్మాణాలను ఎంపీడీవో బాలాజీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లింగాపురం పంచాయతీలో గృహ నిర్మాణాలను పరిశీలించి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు గృహ నిర్మాణాలను పూర్తిచేయాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది వారి సచివాలయ పరిధిలో నిర్మాణ దశలో ఉన్న గృహాలను సందర్శించి లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతన నిర్మాణాలను పూర్తి చేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సంబంధిత అధికారులకు సూచించారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- చౌడేపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్యాధికారిని డాక్టర్ ప్రభావతి దేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు రికార్డులు, పరిసరాలు, మందుల నిల్వలను పరిశీలించారు. వైద్యసేవల గురించి ఆసుపత్రికి వచ్చిన రోగులతో ఆరా తీశారు. చౌడేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి పబ్లిక్ హెల్త్ యూనిట్ మంజూరు అయిందని త్వరలోనే నిర్మాణం జరుగుతుందని, ఇందుకు ప్రభుత్వం రూ.50లక్షలు మంజూరు అయినట్లు ఆమె తెలిపారు. మండలంలో జరుగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, పిల్లల టీకాలు గురించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పవన్ కుమార్, పిహెచ్ఎన్ కృష్ణవేణి, జమున, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మున్సిపల్ పరిధి నెత్తంకండ్రిగ దళితవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి కమిటీ మాజీ డైరెక్టర్ కృష్ణమూర్తి పాఠశాలలోని విద్యార్థులందరికీ మధ్యాహ్నం భోజనం పెట్టి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పంచిపెట్టారు.

చీరలు పంపిణీ

గంగాధర నెల్లూరు: ముందస్తు క్రిస్మస్ వేడుకలు సందర్భంగా గంగాధర నెల్లూరులో టిడిపి మాజీ జెడ్పిటిసి వెంకటేష్, సతీమణి సెల్వరాణి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం భోజనం ఏర్పాట్లు చేశారు. సామాన్య ప్రజల సైతం క్రిస్మస్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని సెల్వరాణి తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి..

ప్రజాశక్తి- పలమనేరు: రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎన్జీజీఓ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏపీ ఎన్‌జీవో హోంలో పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం సమావేశంలో జరిగింది. ఆనంద బాబు మాట్లాడుతూ ఇటీవల జిల్లా పరిషత్ పరిధిలో పలు కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడమే కాకుండా, కారుణ్య నియామకాలు కూడా కల్పించిన జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడుకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎన్జీఓ సంఘం ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్, వినోద, భాస్కర్, రాజశేఖర్, సుజాత, గాయత్రి, గజేంద్ర, ఇంతియాజ్, పురుషోత్తం, కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వపథకాలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ తెలిపారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని జ్యోతీరావు పూలే భవన్‌లోని డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో డిఆర్‌డిఏ జిల్లా సమాఖ్య 21వ వార్షిక మహాసభ నివేదిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కలెక్టర్ పాల్గొన్నారు. డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుకన్యతో కలసి జిల్లా సమాఖ్య మహిళలతో సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ జిల్లాలో పనిచేయడం తనకెప్పుడూ ప్రత్యేకంగా ఉంటుందని, అందులోనూ డిఆర్‌డిఏ కార్యక్రమాలకు హాజరు కావడం చాలా ఆనందాన్నిస్తుందని తెలిపారు. మహిళా సాధికారత అభివృద్ధికి డిఆర్‌డిఏ ముఖ్యపాత్ర పోషిస్తుందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అనేక పథకాలు అమలు అవుతున్నాయని, వీటిని జిల్లా సమాఖ్యల్లోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలలోని మహిళలు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని, ఆ దిశగా పనిచేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయం ఉపాధిలో భాగంగా వ్యాపారాల నిమిత్తం రుణాలు బ్యాంకుల ద్వారా అందించి వారికి తోడ్పాటును అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ వ్యాపారాల నిర్వహణ ద్వారా మరికొందరికి ఉపాధి అందించవచ్చునని, రుణాలు పొందిన తరువాత సకాలంలో చెల్లించడం వల్ల అధిక మొత్తంలో రుణాలు తిరిగి పొందవచ్చునని తెలిపారు. డిఆర్‌డిఏ పీడీ మాట్లాడుతూ ప్రతి మండలంలోని సమాఖ్య మహిళలు కలిసికట్టుగా పనిచేసి రుణాలు తిరిగి చెల్లించడంలో కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏపిడి రవి కుమార్, డిపిఎంలు రవి కుమార్, ఏపీఎంలు మధు, సుబ్బారెడ్డి, అరుణ, జ్యోతి, హేమ పాల్గొన్నారు.

జిల్లా మహిళా సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక

జిల్లా మహిళా సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం చిత్తూరు డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగింది. డిఆర్‌డిఏ జిల్లా సమాఖ్య 21వ వార్షిక మహా సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సమాఖ్య నూతన అధ్యక్షురాలుగా ప్రమీల (వెదురుకుప్పం), కార్యదర్శిగా కార్తీ (గుడిపాల), కోశాధికారిగా ప్రసన్న (పూతలపట్టు), ఉప కార్యదర్శిగా గౌతమి (కుప్పం), ఉపాధ్యక్షురాలుగా చిన్నరెడ్డమ్మ (పెద్దపంజాణి), వ్యవస్థాపక సభ్యులుగా సుమలత (పలమనేరు), సరసమ్మ,(గంగవరం), ప్రభావని (చౌడేపల్లి), ప్రభావతి (నగిరి), మహేశ్వరి (వీకోట), రజియా (యాదమరి), శిరీష (రామకుప్పం)లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా సమాఖ్య ప్రతిధులను డిఆర్‌డిఏ పీడీ, ఇతర అధికారులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



మహిళా జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గం

నిర్మాణాలను వేగవంతం చేయండి

డ్వామా అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లికార్జున్

ప్రజాశక్తి- సోమల :మండలంలో రైతులు తమకు మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ మల్లికార్జున్ కోరారు. శుక్రవారం మండలంలో నిర్మాణంలో ఉన్న పలు క్యాటిల్ షెడ్లను ఆయన ఉపాధి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రైతులకు లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పథకంలో ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన గోకులం షెడ్లను పూర్తి చేసి బిల్లులు మంజూరు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ దినకర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలకు టీకాలు వేయాలి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: కుక్కలకు రేబిస్ రాకుండా తప్పనిసరిగా టీకాలు వేయాలని ఏడీ డాక్టర్ ఆసిఫ్ తెలిపారు. శుక్రవారం మండల పశువైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు తగిన సమయంలో టీకాలు వేయాలని వాటిని సంరక్షించుకునేందుకు వైద్యుల సలహాలు పాటించాలని అప్పుడే అవి నాణ్యంగా తయారై ఉంటాయని నట్టల నివారణ మందులు, రేబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేయడం జరిగిందన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ విజయ్ మోహన్, రాగిమానుపెంట డాక్టర్ మోహన్‌బాబు, డాక్టర్లు పృథ్వి చరణ్, దినేష్, ట్రైనీ డాక్టర్స్, లీలావతి, జెవిఓ, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 22 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డిఆర్‌డిఏ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలో 22 మందికి ఉద్యోగావకాశాలు లభించినట్లు ఐటీఐ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఆర్.రాజేష్ అన్నారు. శుక్రవారం ఐటిఐ కళాశాల ఆవరణంలో జరిగిన జాబ్‌మేళాలలో అపోలో ఫార్మసీ, జెఫ్లో కంపెనీ, విహారి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. అపోలో ఫార్మసీకి ఎనిమిది మంది, జెఫ్లో కంపెనీకి ఐదుగురు, విహారి మార్కెటింగ్ కంపెనీకి నలుగురు, పలు ప్రైవేట్ కంపెనీలకు ఐదుగురు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారికి కంపెనీ ప్రతినిధులు ఆర్డర్ కాపీలను అందించారు. జిల్లా ప్లేస్మెంట్ అధికారి సి.చైతన్య, నైపుణ్యాభివృద్ధి ఆర్డినేటర్ అబ్దుల్ అజేష్, డీపీఓ లోకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి- వెదురుకుప్పం : మండలంలోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి ఆధునిక గణిత శాస్త్రవేత్తల్లో ఒకరైన శ్రీనివాస రామానుజన్ గురించి వారి సిద్ధాంతాల గురించి ప్రసంగించారు. అనంతరం గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్.రుష్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.లక్ష్మీ ప్రసన్న లత, డాక్టర్ కే.శంకర్ రెడ్డి, డాక్టర్ సి.అరుణ, ఎస్.మున్వర్, వై.శ్రీనివాసులు, డాక్టర్ వి.నాగేశ్వరరావు, డాక్టర్ సి.మంగళ గౌరీ, టి.నరేంద్రబాబు, డాక్టర్ లావణ్య కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగు రైతులకు వరం

జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ఆయిల్ ఫామ్ సాగు రైతులకు వరమని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ముద్దుకుప్పం గ్రామంలో అమన్ కంపెనీ ఆధ్వర్యంలో రఘుపతి నాయుడు పొలంలో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గిట్టుబాటు ధర లేక నష్టాలు ఊబిలో ఉన్న చెరకు, మామిడి రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం ఈ పంటను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ధరను నిర్ణయించే అధికారం ఒక ఆయిల్ ఫామ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల ప్రకటిస్తుందని, ఆయిల్ ఫామ్‌లో అంతర పంటలు వేయడం వల్ల లక్షల ఆదాయం పొందొచ్చు అని తెలిపారు. అనంతరం అమన్ కంపెనీ సీఈవో రంగరాజన్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ మొక్కలను ఉచితంగా సప్లై చేస్తామని, అంతర పంటగా కోకో, అరటి, ఫైనాపిల్ వంటి పంటలు సాగు గురించి రైతులకు వివరించారు. హార్టికల్చర్ అధికారి బాలాజీ, అమన్ కంపెనీ ప్రతినిధి మహేష్ రైతుల పాల్గొన్నారు.

రైతుల భూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి- సదుం : రెవెన్యూ సదస్సులలో భూముల సమస్యలపై రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని సదుం తహసీల్దార్ మారూఫ్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం ఊటుపల్లి సచివాలయంలో జరిగిన రైతు సదస్సులో రైతుల నుండి అర్జీలను స్వీకరించారు. సర్పంచ్ చల్లా శ్రీనివాసులురెడ్డి, ఎంపిటిసి స్వరూప, డిటి పి.కుమార్, కమ్యూనిటీ సర్వేయర్ నాగభూషణం, వీఆర్ఓ అక్బర్ పాల్గొన్నారు.

సోమల: మండలంలోని ఇరికిపెంట సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 87 రెవెన్యూ పరంగా ఆరు అటవీ శాఖపరంగా దరఖాస్తులు వచ్చాయని డీటీ ఇబ్రహీం తెలిపారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసులు నాయుడు, డీలర్ చంద్రన్న, వీఆర్వో బాదుల్లా, వీఆర్ఏ సుగుణ పాల్గొన్నారు.

చౌడేపల్లి: దిగువపల్లిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వివిధ భూ సమస్యలతో 100 మంది రైతులు అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఆర్ఐ భారతి, మండల సర్వేయర్ గుణశేఖర్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: రైతులు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అమరావతి కోరారు. శుక్రవారం మండలంలోని తుంబకుప్పంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, ఆర్ఐ మధుసూదన్, సర్వేయర్ లావణ్య పాల్గొన్నారు.

పోలీసు మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు


ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని విజయపురం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఈ ఏడాది నవంబర్ 7వ తేదీ అనారోగ్యంతో మరణించిన పోలీస్ కానిస్టేబుల్ తంగరాజు సతీమణి వల్లియమ్మకి శుక్రవారం విడో ఫండ్ నుండి రూ.50వేలు, ఫ్లాగ్ ఫండ్ నుండి రూ.25వేలు చెక్కులను అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్, ఇంచార్జ్ అడ్మిన్ రాజశేఖర్ రాజు, చిత్తూరు పోలీస్ ఆఫీస్ బి సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, క్లర్క్ పార్థసారథి నాయుడు సమక్షంలో చిత్తూరు పోలీస్ కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, పోలీస్ శాఖ తరపున వారికి అన్ని విధాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ డిపార్టుమెంటు తరపున కుటుంబానికి అందాల్సిన ప్రయోజనాలు ఆలస్యమవ్వకుండా చూస్తామని, ఏవైనా సమస్యలు ఉంటే నిరభ్యంతరంగా సంప్రదించవచ్చని తెలిపారు.



ఆర్థిక సాయం అందిస్తున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు

ప్రశ్నా పత్రాలను పాఠశాల వద్దకే చేర్చాలి..

సిద్ధయ్య శెట్టి మృతికి సంతాపం తెలిపిన ఉపాధ్యాయులు



ప్రజాశక్తి- పెద్దపంజాణి: విద్యాశాఖ అధికారులు అందించే ప్రశ్నాపత్రాలను సంబంధిత పాఠశాల వద్దకే చేర్చాలని అప్పినపల్లి పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం డిమాండ్ చేశారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు సిద్ధయ్య శెట్టికి సంతాపం తెలిపారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఉపాధ్యాయుడు సిద్ధయ్య శెట్టి ప్రశ్న పత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి పాఠశాలకు తీసుకెళ్తూ రోడ్డు ప్రమాదంలో చనిపోవడం బాధాకరమని అన్నారు. గతంలో సిఆర్సి పరిధిలోని ఉన్నత పాఠశాలకు ప్రశ్నాపత్రాలను విద్యాశాఖ అధికారులు చేర్చేవారని, ఆ ప్రశ్న పత్రాలను సమీప పాఠశాల ఉపాధ్యాయులు తీసుకెళ్లే వారిని తెలిపారు. అయితే రాష్ట్రంలో ఎక్కడో ఎవరో ఉపాధ్యాయులు ప్రశ్నాపత్రాలను పరీక్షకు ముందే ఓపెన చేశారని అందుకు రాష్ట్రమంతా ఆ విధానాన్ని అమలుపరచడం భావ్యం కాదని అన్నారు. తప్పు చేసిన సంబంధిత ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలి కానీ, ఉపాధ్యాయులందరినీ తప్పు పట్టడం సరికాదని అన్నారు. పరీక్ష రోజు ఉదయం, మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి ప్రశ్నపత్రాలను తీసుకురావడం కష్టతరం అవుతుందని, ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు పాఠశాల పరిధిలోని సిఆర్‌సి సెంటర్లకు ప్రశ్నా పత్రాలను చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. ప్రధానోపాధ్యాయులు నంద కుమార్, శంకర్, ఉదయ్ కుమార్, హరికృష్ణ, ప్రసన్నలక్ష్మి, శ్రీదేవి, భారతి, సోమశేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

రొంపిచర్ల: ఉపాధ్యాయులు సిద్దయ్య శెట్టికి విధి నిర్వహణలో భాగంగా ప్రశ్నాపత్రాలు తీసుకెళ్తూ రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఈశ్వర మహేంద్ర, పులిచెర్ల మండల యుటిఎఫ్ అధ్యక్షులు హరినాధ రెడ్డప్ప, ప్రధాన కార్యదర్శి విజయకుమార్ సంతాపం తెలియజేశారు. ఈ సంఘటన జరిగిన తర్వాత అయినా ప్రభుత్వ అధికారుల అనాలోచిత నిర్ణయాలను పునఃసమీక్ష చేసి ఉపాధ్యాయులకు చదువు చెప్పే వాతావరణం కల్పించాలని, మృతి చెందిన సిద్దయ్య శెట్టి కుటుంబానికి ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఫుట్ బాల్ టోర్నమెంట్‌కు కుప్పం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కాలికట్ విశ్వవిద్యాలయంలో ఈనెల 21వ తేదీన జరగబోవు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మెన్స్ ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నట్లు కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి.నాగరాజు తెలిపారు. జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం తరపున 15 మంది విద్యార్థుల బృందం ఈ పోటీలలో పాల్గొననున్నారని, ఇందులో తమ కళాశాల నుండి సిఎస్ఈ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అబీన్ బేబీ, శ్రీహరి, సిఎస్ఎం విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి దీరిన్ డేవిస్ విద్యార్థులు పాల్గొన్ననున్నట్టు తెలిపారు. ఈ క్రీడాకారులకు గత నెలరోజులుగా కళాశాలలో ప్రత్యేక శిక్షణ అందించినట్టు తెలిపారు. వీరు ఈ పోటీలో ప్రతిభను ప్రదర్శించి విజయం సాధిస్తారని బిసిఎన్ విద్యాసంస్థల చైర్మన్, ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, సీఈవో సాగర్ రాజ్ ఆశాభావం వ్యక్తపరిచారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకరబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, ఫీజికల్ డైరెక్టర్ సతీష్ కుమార్, పిఆర్ఓ ప్రవీణ్ కుమార్ అభినందించారు.



క్రీడాకారులతో ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం

మూడు నెలల్లో పరికరాలు ఉచితంగా పంపిణీ



విజయపురంలో నిర్వహించిన శిబిరంలో అధికారులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): విభిన్న ప్రతిభావంతులకు, వయోవృద్ధులకు ఉచితంగా సహాయ పరికరాలు అందించడానికి పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక గుర్తింపు శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని జిల్లా ఉద్యానశాఖ ఉప సంచాలకులు మధుసూదన్ రెడ్డి, నగరి ఆర్డీఓ భవాని శంకరీలతో కలసి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి వై.శ్రీనివాస్ ప్రారంభించారు. 586 మంది ఈ శిబిరంలో పరీక్షలకు హాజరుకాగా సహాయ పరికరాలు అందించేందుకు 442 మంది అర్హత పొందినట్లు ఆయన తెలిపారు. భారత ప్రభుత్వ సంస్థ (ఎఎల్ఐఎంసీవో) ద్వారా జిల్లాలో ఈనెల 17 నుండి ప్రారంభమైన ఈ శిబిరాలు ఈనెల 24వ వరకు నిర్వహిస్తామన్నారు. సహాయ ఉపకరణాల వినియోగం తప్పనిసరి అయినవారికి, అర్హతను బట్టి ఒకటి కంటే ఎక్కువ ఉపకరణాలు అవసరమైన వారిని గుర్తించామన్నారు. వారికి అవసరమైన చేతి కర్రలు, వాకర్లు, మూడు కాళ్ళ చేతి కర్రలు, నాలుగు కాళ్ళ చేతి కర్రలు, వాకర్స్, చంక కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రై సైకిల్, మూడు చక్రాల సైకిళ్ళు , రోలేటర్స్, కుష్టు వ్యాధి గ్రస్తులకు లెప్రెసీ కిట్లు, డైసి ప్లేయర్, స్మార్ట్ కెన్ కృత్రిమ అవయవాలు అవసరమని గుర్తించడం జరిగిందన్నారు. వీరికి మూడు నెలల్లో ఈ సహాయ పరికరాలను అందిస్తామన్నారు. తహశీల్దార్ రవిశేఖర్, సీఐ మహేశ్వర్, ఎంపీడీవో సతీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సహాయ పరికరాల గుర్తింపు శిబిరం

పెద్దపంజాణి: మండలంలోని దివ్యాంగులకు సహాయ పరికరాల గుర్తింపు శిబిరం పలమనేరులో నిర్వహిస్తున్నారని ఎంపీడీవో బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ జీవన పరికరాలు పంపిణీ కొరకు కాన్పూర్ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ఈనెల 22వ తేదీ ఆదివారం పలమనేరులో జిల్లా ప్రజాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో శిబిరం నిర్వహిస్తుందని తెలిపారు. అర్హత, అవసరం కలిగిన విభిన్న ప్రతిభావంతులు పరీక్షించి ఎంపిక చేసేందుకు ప్రత్యేక గుర్తింపు శిబిరంను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంపికైన వారికి పరికరాలను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. శిబిరంకు వచ్చే వారు యుడి ఐడి కార్డు, రసీదు, ఆధార్ కార్డు, సదరం ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, నాలుగు పాస్ ఫొటో సైజ్ ఫొటోలు, మొబైల్ నెంబర్ అన్ని ధృవపత్రాలను రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో రావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

క్రైం న్యూస్

14,430 కేజీల బియ్యం స్వాధీనం



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అక్రమంగా తరలిస్తున్న పిడిఎఫ్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ముందస్తు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని కేజీ సత్రం వద్ద ఒక లారీల్లో 14,430 కేజీల బియ్యాన్ని లారీలో నుంచి అక్రమంగా తరలించేందుకు ఉండగా రెవెన్యూ సిబ్బంది, పోలీసులు తనిఖీలు చేసి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ బియ్యాన్ని చిత్తూరులోని ఎంఎల్ఎస్ పాయింట్లు ఉంచి లారీని పోలీసులు ఆధీనంలో ఉంచినట్టు వారు తెలిపారు. ఈ దాడుల్లో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మధుసూదన్, విఆర్వో హేమచంద్ర, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డం రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుందని సీఐ శ్రీనివాసులు తెలిపారు. నలగంపల్లి గ్రామంకు చెందిన దినకర్ (29), విక్రమ్ సొంత పనుల నిమిత్తం బంగారుపాళ్యం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డం రావడంతో అదుపుతప్పి బోల్తాపడి దినకర్ తలకు తీవ్రంగా గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. విక్రమ్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వైసీపీ టీడీపీ నేతల మధ్య ఘర్షణ

పోలీసుల చొరవతో సద్దుమణిగిన వైరం



ఘర్షణ పడుతున్న వైసిపి, టిడిపి నాయకులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: నేడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక వైసీపీ నేతలు స్థానిక వైసిపి జెండా ఉన్న ఆవరణం, పరిసరాలను శుభ్రం చేస్తున్న విషయం తెలుసుకున్న టిడిపి నేతలు ఆ స్థలాన్ని శుభ్రం చేయకూడదని అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి గొడవ సద్దుమణిగేలా చేశారు. శనివారం జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో ఇరు వర్గాల మధ్య మళ్లీ ఎక్కడ గొడవలు జరుగుతాయో అని గ్రామస్తులు భయాందోళనకు గురైతున్నారు. పోలీసులు శాంతిభద్రతలు కాపాడాలని, గ్రామంలో ఎటువంటి ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు: ఎస్సై

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: 18 సంవత్సరాల లోపల మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపైన వాహన యజమానిపైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ తెలిపారు. శుక్రవారం మండలం మెదవాడ గ్రామానికి చెందిన ఓ పౌల్ట్రీ ఫారంలో ఒరిస్సాకు చెందిన పది సంవత్సరాల పిల్లవాడు ట్రాక్టర్ నడిపిన వీడియో సోషల్ మీడియాలో హల్చల్ చేయడంతో వెంటనే స్పందించిన ఎస్సై ఆ ట్రాక్టర్ యజమానిని ట్రాక్టర్ నడిపిన 10 సంవత్సరాల ఒరిస్సాకు చెందిన పిల్లవాడిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి లేకుంటే వారి వారి జరిమానా విధిస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ వరకు రోడ్డు భద్రత నియమ నిబంధనలు ప్రతి వాహనదారుడు పాటించాలని తెలిపారు.